నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్, గురువారం 13 మార్చి 2025 | ADILABAD NIRMAL

అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్, మార్చి 12 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జైనథ్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది చేస్తున్న విధులు, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో లభ్యమైన వాహనాలపై సిబ్బందిని అడిగి ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో వచ్చే గ్రామాలు, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పోలీస్ స్టేషన్‌ల వివరాలు, నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్ ఆవరణలో ఒక మొక్క నాటారు. అనంతరం రాష్ట్రంలోని అతిపురాతనమైన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్పీకి స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో వచ్చే పిప్పర్‌వాడ టోల్ ప్లాజా, పెన్‌గంగా వద్ద సరిహద్దు, భోరజ్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, పీఎస్సై మధుకృష్ణ ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే

కేసీఆర్‌కు నమస్కరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, మార్చి 12 : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. అసెంబ్లీ ప్రాంగణంలోకి వస్తున్న సమయంలో పుష్పగుచ్ఛం అందజేశారు. అభివాదం చేసి స్వాగతం పలికారు.

పెంబిలో నీళ్లు లేక బీడుగా వ్యవసాయ భూమి

బీడుగా భూములు

● భీమన్న చెరువుకు సరస్వతీ ఉప కాల్వ ద్వారా సరఫరా కాని సాగు నీరు ● నిధులు మంజూరైనా అనుమతి ఇవ్వని అటవీ శాఖ అధికారులు

పెంబి, మార్చి 12 : మండల కేంద్రంలోని భీమన్న చెరువుకు సరస్వతీ ఉప కాల్వ డీ-28 ద్వారా సాగు నీరు సరఫరా కావడం లేదు. దీంతో దీని ఆయకట్టు కింద దాదాపు 60 మంది రైతులకు చెందిన 120 ఎకరాలు బీడుగా మారాయి. డీ-28 కాల్వ మరమ్మతులు చేపట్టకపోవడంతో భీమన్న చెరువు వరకు నీరు రావడం లేదు. వర్షకాలంలో చెరువు నిండడంతో ఒక్క పంట మాత్రమే పండిస్తున్నామని, డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి యాసంగికి కూడా సాగు నీరు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. భూములు బీడుగా ఉండడంతో కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి భీమన్న చెరువుకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ నవీన్‌ను వివరణ కోరగా.. మరమ్మతు కోసం నిధులు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగు నీరు అందించడానికి కృషి చేస్తా.

నీరులేని సరస్వతీ ఉప కాల్వ డీ-28

నీరు రాక.. కూలీకి పోతున్న..

నాకు భీమన్న చెరువు ఆయకట్టు కింద ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంది. డీ-28 కాల్వ మరమ్మతుకు గురికావడంతో చెరువుకు సాగు నీరు రావడం లేదు. దీంతో యేటా యాసంగి సీజన్‌కు భూములు బీడుగా ఉంటున్నాయి. కాల్వకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులందరం కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవించుకున్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. యాసంగి సాగు లేక కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, నాయకులు డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించేలా కృషి చేయండి.

- చింతకింది రాజేందర్, రైతు, పెంబి.

నీళ్లు లేక ఎండుతున్న జొన్న పంట

అడుగంటిన ఆశలు

● బావులు, బోర్లలో కానరాని నీరు
● పొట్ట దశలో ఎండుతున్న జొన్న ● ఆందోళనలో రైతన్నలు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/లింగాపూర్, మార్చి 12 : జిల్లాలో ఈ యాసంగిలో వేసిన పంటలపై ఇక రైతాంగం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలు పెరిగి భూగర్భ జలాలు అడుగంటుతుండగా, చెరువులు, బోర్లపై ఆధారపడి వేసుకున్న పంటలు చేతికందకుండా పోయే దుస్థితి వచ్చింది. ఇక కొన్నిచోట్ల బోర్లు, బావుల్లో కొద్దిపాటి నీరున్నా కరెంట్ కోతల వల్ల ప్రయోజనం లేకుండా పోతున్నదని కర్షకలోకం కన్నీరు పెట్టుకుంటున్నది.

6050 ఎకరాల్లో జొన్న సాగు..

జిల్లాలో ఈ యాసంగిలో 6050 ఎకరాల్లో జొన్న సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది. మార్చి నెలాఖరుకల్లా పంట కోత ప్రారంభమవుతుంది. ఈ సమయంలో నీళ్లు సరిపడా అందించాల్సి ఉంటుంది. కానీ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు కరెంట్ కోతల వల్ల పంటలకు నీరందించుకోలేని పరిస్థితి వచ్చిందని రైతులు చెబుతున్నారు. వానకాలంలో సరైన దిగుబడి రాక నష్టాల్లో ఉన్న రైతులు ఈ యాసంగిలో కూడా మరింత నష్టం పోయే ప్రమాదమున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే శనగ 4 వేలు, మొక్కజొన్న 800 ఎకరాలు, గోధుమ వెయ్యి ఎకరాల్లో సాగు చేయగా, ఈ పంటలు కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయింది.

ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి జాదవ్ బాబు. ఈయనది కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్ మండల కేంద్రం. తనకున్న రెండెకరాల్లో జొన్న పంట వేశాడు. ఎండలు ముదరడంతో బావిలో నీళ్లు అడుగంటి పోయాయి. పొట్ట దశలో ఉన్న పంటకు నీరందించే పరిస్థితి లేకుండా పోయింది. కష్టనష్టాల కోర్చి పెట్టుబడులు తెచ్చి వేసిన పంట చేతికందకుండా పోయే దుస్థితి వచ్చింది. ఇగ ఇలాగైతే వ్యవసాయం ఎట్లా చేసుడు.. కుటుంబాన్ని ఎట్లా పోషించుడు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కమిషన్‌లతో కాంట్రాక్టర్ల పరేషాన్

హైదరాబాద్‌లో బిల్లుల కోసం 20 శాతం

● జిల్లా కార్యాలయాల్లో కూడా పర్సంటేజీలు
● విసుగు చెంది ఏసీబీని ఆశ్రయిస్తున్న వైనం

ఆదిలాబాద్, మార్చి 12(నమస్తే తెలంగాణ) : అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు తమ బిల్లుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. హైదరాబాద్‌లో వివిధ కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెంది, చివరకు 20 శాతం కమిషన్‌లు చెల్లించి బిల్లులు మంజూరు చేయించుకుంటున్నారు. తీరా తమ పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని అధికారులను సంప్రదిస్తే అక్కడా వారికి కమిషన్ల బాధ తప్పడం లేదు. కమిషన్‌లు ఇస్తేనే బిల్లులు చెల్లిస్తామంటూ అధికారులు చెబుతుండడంతో విసుగు చెందిన కాంట్రాక్టర్లు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. తాజాగా మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఈడబ్ల్యూఐడీసీ) శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జిన్నంవర్ శంకర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కాడు. రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల మైనార్టీ స్కూల్ బిల్డింగ్ కాంట్రాక్టర్ నుంచి డీఈ శంకర్ ఒక శాతం లంచం రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్ అభ్యర్థన మేరకు రూ.లక్షకు ఒప్పందం కుదిరింది. మొదటి విడుతగా రూ.50 వేలు తీసుకోగా అధికారులు పట్టుకున్నారు.

పలు శాఖలపై ఆరోపణలు

ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడుతారు. రోడ్లు, భవనాలు, వంతెనలు, చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులు ఇతర పనులు జరుగుతున్నాయి. జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్‌లు ఆన్‌లైన్‌లో టెండర్‌లు దాఖలు చేసి పనులు తీసుకుంటారు. పని పూర్తయిన తర్వాత కాంట్రాక్టర్లకు బిల్లులు రావాలంటే ఇంజినీర్‌లు ఎంబీలు రాయడంతోపాటు కార్యాలయ సిబ్బంది కూడా వివిధ పత్రాలను రాయాలి. ఆయా పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పంపిన బిల్లులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. పాత బిల్లులతోపాటు ఇటీవల పూర్తిచేసిన బిల్లుల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసినా బిల్లుల ఇవ్వడానికి కమిషన్‌లు ఇవ్వడం తప్పడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే పనులు చేయడం మానేస్తామని కాంట్రాక్టర్‌లు అంటున్నారు.

ముందుగానే కమిషన్‌లు

జిల్లాలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు విషయంలో అధికారులు కాంట్రాక్టర్‌లను ముందుగానే కమిషన్‌లను అడుగుతున్నట్లు కాంట్రాక్టర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 14 నెలలుగా బిల్లులు రావడం లేదని దీంతో అధికారులు ముందుగానే డిమాండ్ చేస్తున్నట్లు అంటున్నారు. వర్క్ మెజర్ చేయాలని అడిగితే పాత బిల్లుల పర్సెంటేజీ సంగతి ఏమిటని అడుగుతున్నారని, మేము ఉంటామో బదిలీ అవుతామో తెలియదని అంటున్నారని చెబుతున్నారు. కొన్ని శాఖల్లో అధికారులు దీర్ఘకాలంగా పనిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు.

కరెంటు సరఫరాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అధికారుల తీరుపై ఆగ్రహం

కరెంటు రాకుంటే పంట చేతికి రాదు..

నేను హస్నాపూర్‌లో గల నాలుగెకరాల్లో జొన్న వేశా. భూగర్భ జలాలు పడిపోయి రెండెకరాలు పూర్తిగా ఎండిపోయాయి. మిగతా రెండెకరాలు చేతికి రావాలంటే కరెంటు ఉండాలి. కానీ.. కరెంటు ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో? తెలియడం లేదు. పంటను కాపాడుకోవాలంటే నిరంతరాయంగా కనీసం అవసరమైన సమయాల్లో విద్యుత్ సరఫరా అందాలి. అసలు కరెంటే రాకపోతే, మేం ఏం చేయగలం? పొలాలకు నీళ్లు పారక పంట ఎండిపోతుంటే, ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభుత్వం వెంటనే స్పందించి, నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ అందించాలి. లేదంటే జొన్న పంట చేతికి రాదు.

- దర్శనాల రవి కిరణ్, రైతు, హస్నాపూర్

తాంసి, మార్చి 12 : హస్నాపూర్ గ్రామ శివారులో గల పొలాలను కలెక్టర్ రాజర్షి షా బుధవారం సందర్శించారు. భూగర్భ జలాల ప్రభావాన్ని సమీక్షించడంతోపాటు, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్లను పరిశీలించిన కలెక్టర్ భూగర్భ జలాల పరిస్థితిపై రైతులతో మాట్లాడారు. భూగర్భ జలమట్టం గణనీయంగా తగ్గిపోతుండడంతో రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమయానికి తగిన వర్షపాతం లేకపోవడం, బోర్లు ఎండిపోతుండడం, కరెంటు పోతే వస్తలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వచ్చినట్లు సక్రమంగా కరెంటు రావడం లేదని, పోతే రెండు, మూడు గంటలు ఎదురు చూడాల్సి వస్తుందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే మత్తడి కుడి కాలువను ప్రారంభించలేదని, కుడి కాలువ నుంచి సాగునీరు అందేలా చూడాలని వారు కోరారు. దీంతో రైతుల సమస్యలపై అధికారులతో చర్చించిన కలెక్టర్, తగిన పరిష్కారాలు సూచించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులకు తగిన మార్గదర్శకాలు అందిస్తూ, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

సక్రమంగా కరెంట్ అందడం లేదని పలువురు రైతులు కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేయడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పని తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తడి ప్రాజెక్టు కుడి కాలువ నుంచి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఏవో రవీందర్, ఏఈ మనోజ్, నాయకులు కృష్ణ రత్న ప్రకాశ్, వినోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా